PRAMUKHANDHRA

*22nd Year of Publication*

We carry the news and views of Telugus

# ప్రముఖాంధ్ర

₹15

సంపాదకుడు
గోటేటి శ్రీ రామారావు

మార్చి 2016



THE ONE AND ONLY TELUGU MAGAZINE CIRCULATED IN USA, UK, CANADA, GERMANY, AUSTRALIA, MAURITIUS, SOUTH AFRICA, UAE, KUWAIT, SINGAPORE, MALAYSIA & ALL OVER INDIA

# విశ్వయోగి విశ్వంజీ మహరాజ్
# జన్మదిన వైభవ సందర్భమున
# 5-3-2016
## విశ్వనగర్, గుంటూరు

## గురువందనం సమర్పిస్తున్నాం
## రామరాజ్ ప్రింటర్స్ - ప్రముఖాంధ్ర - గోటేటి గ్రాఫిక్స్



శ్రీశ్రీశ్రీ విశ్వయోగి విశ్వంజీ మహరాజ్




# ప్రముఖాంధ్ర

ప్రపంచ తెలుగుల మానస పత్రిక

మార్చి 2016

సంపుటి : 22 **255** సంచిక : 3




## వయో వృద్ధత్వం వ్రాత వృద్ధత్వం కలిగించదు!

### – ఆత్మనోమోఖార్ధం అమ్మ నుడి వొడినిచ్చింది!!! –

**84** సంవత్సరాల వయసు వచ్చినప్పటికినీ వ్రాయకలుగుతున్నానంటే భారతభారతి యిచ్చిన శక్తి, వేంకటేశ్వర విభుడనుగ్రహించిన ఆయుర్బలమూ – చదువరుల యిచ్చిన ప్రోత్సాహములూ!

**82** సంవత్సరాల క్రితం అమ్మ జ్ఞాపకం వస్తూ వుంటుంది. అమ్మ చంకదిగకుండా నను పెంచింది, తరువాత మా నాన్న పది సంవత్సరాలు అమ్మలేని లోటు కనిపించకుండా ప్రాణాలన్నీ నాపై నిలుపుకు పెంచాడు.

**త**ల్లి ప్రేమ పాలలా స్వేచ్ఛమైనది. తండ్రి ప్రేమ ఆ పాలలో దాగి వున్న వెన్న వంటిది. కుమారుని ఉన్నతి తండ్రి కోరుతాడు. సంస్కారము నేర్పుతాడు. కొడుకు అడుగు పటిష్టంగా వేసేవరకూ వెన్నంటి ఉంటాడు. నేను చెన్నయ్ వచ్చిన తరువాత మా నాన్న ఒక నెల దగ్గరుండి, ఏ ధనలోటూ లేకుండా చేసి వెళ్ళాడు. అలా చెన్నయ్ నుంచీ పాలకొల్లు వెళ్ళిన నాన్న నా యోగ క్షేమాలను రెండు రోజులకొక ఉత్తరం ద్వారా తెలుసుకుంటూనే ఉన్నాడు.

**కొ**న్నాళ్ళకు తెలుగు స్వతంత్ర వారపత్రికలో ఉప సంపాదకునిగా ఉద్యోగం దొరికింది. నెల జీతం అందుకుంటున్నానన్న సంతోషం కలిగే సమయంలో మా నాన్నగారు పోయారనే వార్త అందింది. పత్రికా సంపాదకులు గోరా శాస్త్రి గారికి టెలిగ్రాము చూపించాను. మీరు మీ నెల జీతం తీసుకుని వెళ్ళండి – అన్నారు. తిరిగి వచ్చేసరికి ఆ ఉద్యోగం మరొకరికి యిచ్చారు. రాగానే ఇది మరొక విషాద వార్త.


**ఓ** వారం రోజులు గడిచింది. బెంగుళూరులోని 'ప్రజామత' వార పత్రికలో ఉపసంపాదకుని అవకాశం ఉందంటూ పిలుపు వచ్చింది. వెళ్ళాను. అదీ ఆరు నెలల భాగ్యమే అయింది. తిరిగి చెన్న పట్టణం వచ్చాను. ఇంతటితో ఉద్యోగపర్వానికి స్వస్తి చెప్పాను. ఇహ మద్రాసే వాసయోగ్యమని నిశ్చయించుకున్నాను. స్వంతంగానే పత్రికను ప్రారంభం చేయాలని నిర్ణయించుకున్నాను.

'**త**స్మై నమః కర్మణే' అంటూ కర్మదేవతకు నమస్కారం చేసి – నాచే మంచి కార్యములను చేయిస్తూ, స్వతంత్రంగా జీవించేట్లు అనుగ్రహించు శ్రీనివాసా అని ప్రార్థించాను.

చెన్నయ్‌లో ఉన్న నా ప్రార్థను – రెండు వందల మైళ్ళ దూరంలో ఉన్న తిరుమల శ్రీనివాసుడి చెవిని పడిందేమో! వేంకటేశ నమోదేవో నాస్తి నాస్తి మహీతలే! వినా వేంకటేశం ననా థో ననాథః । సదా వేంకటేశం స్మరామి స్మరామి' అను శ్లోక స్తుతి ఫలించింది. 'మధురవాణి' పత్రికను ప్రారంభించే శక్తిని వేంకటేశ్వరుడే అనుగ్రహించాడు. మధురవాణి జీవితంలో ఒక్కొక్క మెట్టునే అధిరోహింపచేస్తూ వచ్చింది. ఆ ఆరోహణ క్రమంలో – రామరాజ్ పబ్లికేషన్స్; రామ్‌రాజ్ ప్రింటర్స్, అటు తరువాత గృహ నిర్మాణం, సుపుత్రోదయం, గోటేటి పబ్లిసిటీస్, గోటేటి ఫిలిమ్ డైరీ, గోటేటి ఫిలిమ్స్, సినీ రమ ప్రచురితమయ్యాయి. 'ప్రముఖాంధ్ర' ప్రపంచ తెలుగుల మా(న)స పత్రికగా రూపొందింప చేయడంలో – దేశ విదేశాల పఠితల అభిమానం, పర్యటనా అదృష్టం కలిగించింది.

**2003** సం॥లో నా సహధర్మచారిణి సత్యవతి మరణం నాకు పెద్ద దెబ్బ. శరాఘాతం. నన్నెంతగానో కృంగతీసింది. అప్పట్నుంచీ ఆనందం కొరవడుతూ వచ్చింది. అనారోగ్యం ఆస్పత్రిపాలు చేసింది. ఒక్కసారి ఆసుపత్రికి వెళ్ళినవాడు, జీవితాంతం వెడుతూనే వుండాలి.

**స**రస్వతి అనుగ్రహంతో సత్కార్యాలూ చేస్తూ, సత్కారాలూ పొందుతూ వచ్చాను. పీఠాధిపతుల అనుగ్రహమూ, గ్రంథ రచనం, ఆవిష్కరణ కార్యక్రమాలు, వ్రాతకు (రచనకు) వృద్ధత్వాన్ని కలిగించలేదు. డబ్బై, ఎనభై వత్సరాల వయసులో కూడా కలం ఉత్సాహంగా ఉరకలు వేస్తూనే వుంది. ఈశ్వరాను గ్రహమనే భావిస్తున్నాను.



బుధజన విధేయుడు

**– గోటేటి శ్రీరామారావు**


Editor : **GOTETI SRI RAMA RAO**, Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
**www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com**
**YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-**

# ప్రముఖాంధ్ర కొనసాగినంత కాలమూ నా శక్తి కొనసాగుతుంది.

మార్చి 7వ తేదీ 84వ సంవత్సరం వయసు ప్రవేశిస్తూంది. 'ప్రముఖాంధ్ర' కొనసాగినంత కాలమూ ఈ శక్తి కొనసాగుతుందనే భావిస్తూన్నాను.

అనుకున్నంత స్థాయిలో ఒక్క సినిమా రంగ నిర్మాణంలో రాణించ లేకపోయాను. అందుకు కారణాలు శతకోటి. ఎన్టీ రామారావు ముఖ్యమంత్రిగా ఉండే కాలంలో ఉన్నబాటున తెలుగు సినిమా రంగాన్ని హైదరాబాదుకు తరలించాలనే తొందరబాటు నిర్ణయం – కొందరి నిర్మాతలతో బాటు నన్నూ నష్టపరిచింది.

పత్రికా ప్రచురణ ప్రాచుర్యం ఒకింతగా నన్ను రక్షించింది. నా సతీమణి ఆర్థిక చాకచక్యము చాలా తోడ్పడింది. గురువుల ఆశీస్సులు గురుతర బాధ్యత వహించి ఎన్నో అవాంతరాలను అధిగమించేట్టు చేసింది.

తొలి గురువు శ్రీశ్రీ బషీర్‌బాబా – "ఒరేయ్! గోటేటి శ్రీరామారావూ! నీవు నడిసాగరమున పడినా ఈదుకుంటూ తీరానికి వచ్చేస్తావ్! నీవు పట్టినది బంగారమవుతుంది. ముందుకు సాగు అన్నారు – అది అక్షర సత్యమైంది.

ఉపకార గుణమే తక్క, అపకార గుణమెరుగని వాణ్ణి. అమ్మను మనసులో నిలుపుకుని, కార్యం ప్రారంభించేవాణ్ణి. మా అమ్మ ఫోటో లేదు, నా హృదయంలో మాత్రం అమ్మ చిత్రం ఉంది.

**అహరంబున బ్రోచెడి అమ్మ కంటె**
**ఆదరంబగు వ్యక్తులు అవని కలరె**
**అమ్మ ప్రథమాక్షరంబె ఆధ్యక్షరంబు**
**ప్రాణికోటికి అమ్మయే ప్రాణ సమము**

అన్నారు భగవాన్ సత్యసాయిబాబా.

ఈ ప్రపంచాన అనేకవిధములైన సంబంధ బాంధవ్యాలున్నాయ్. కానీ అమ్మను మించిన మాధుర్యబంధమేమున్నది? 70, 72 సంవత్సరాల క్రితం గ్రోలిన తల్లి ప్రేమను గుండెల్లో భద్రపరచుకున్నాను. 62 సంవత్సరాల క్రితం అవ్యాజానురాగాన్ని పంచిన నాన్న ప్రేమ గుండెల్లోనే దాగి ఉంది.

సాగర తరంగాలు! సువర్ణ సైకతాలు!

యాత్రీకుల విశ్వాసాలు! రామేశ్వరం మసీదు –

అన్నీ కలిసి ఒక్కటైతే మా అమ్మ అన్నారు పూర్వపు రాష్ట్రపతి అబ్దుల్ కలాం.

నన్ను కని మా అమ్మ ఒక దశాబ్ద కాలమే ఉంది, ఏడు దశాబ్దాల క్రితం నన్ను విడిచిపోయినా, గుండెలో ఒక పక్కన ఉన్నది. రెండు దశాబ్దాల కాలం నన్ను కంటికి రెప్పలా కాచిన మా నాన్న మరోపక్క ఉన్నారు. ఇరువురి ఫోటోలూ లేకపోవడం దురదృష్టం.

మా నాన్నగారు ఐదు భాషల్లో పండితులు. వారి పోలిక కొంత వచ్చినందువల్లనేమో, వయోవృద్ధత్వం కలిగినా, వ్రాతకు వృద్ధత్వం కలుగలేదు. మార్చి 7న వచ్చే 84వ పుట్టినరోజు సారస్వత ప్రియత్వాన్ని కొనసాగింపచేయకలదనెడు విశ్వాసం ఉన్నది. వృద్ధాప్యం తన కక్ష తీర్చుకుంటున్నప్పటికినీ, ప్రముఖాంధ్ర వ్రాతకు వృద్ధత్వాన్ని కలిగించడం లేదు.

మధురమైన మాతృభాషకున్న ఆధ్యాత్మిక సంపదను అమ్మ నుడి ద్వారా చెప్పడంలోనే మోక్షం ఉందని విశ్వసిస్తున్నాను.

*– గోటేటి శ్రీరామారావు*

**Statement about ownership and other particulars about Newspaper "PRAMUKHANDRA" Chennai - 600 004.**
**FORM IV (See Rule 8)**

| | | | |
|---|---|---|---|
| 1. | Place of Publication | : | Chennai |
| 2. | Periodicity of its Publication | : | Monthly |
| 3. | Printer's Name | : | **G.V. RAO** |
| | Nationality | : | Indian |
| | Address | : | Printed at **Goteti Graphics** 64, Thambaiah Reddy Road, West Mambalam, Chennai - 600 033. |
| 4. | Publisher's Name | : | **G.V. RAO** |
| | Nationality | : | Indian |
| | Address | : | 64, Thambaiah Reddy Road, West Mambalam, Chennai - 600 033. |
| 5. | Editor's Name | : | **G.S. RAMARAO** |
| | Nationality | : | Indian |
| | Address | : | 64, Thambaiah Reddy Road, West Mambalam, Chennai - 600 033. |
| 6. | Name & Address of individuals who own the Newspaper and Partners | : | **GV RAO** 64, Thambaiah Reddy Road, West Mambalam, Chennai - 600 033. |

I, **G.V. RAO** hereby declare the particulars given above are true to the best of my knowledge and belief.

Date : 29-2-2016 **(Sd.,) GV RAO**
Chennai - 600 033. PUBLISHER

## విదేశాంధ్ర పాఠకులకు మనవి!

**విదేశాలకు పోస్టు ద్వారా పంపుతున్న 'ప్రముఖాంధ్ర' ప్రతికి రూ. 50/-లను అదనంగా చెల్లించవలసి వస్తున్నది. రూ. 90/-లు భారం వహించడం సాధ్యం కాదని గ్రహిస్తూ, ప్రతీ పాఠకుడూ గ్రహించి ఈ అదనపు మొత్తాన్ని పంపగోరుచున్నాం.**

## శ్రీ జగద్గురు భారతీతీర్థ మహాస్వామి చరణుల ఉపదేశము



# పాపకార్యాలను వదలిపెట్టండి

వాచికమైన పాపాలను ఇతరుల మనస్సుకు కష్టం కలిగే విధంగా మాట్లాడటం, అసత్యం పలకటం, ఇతరులపై చాడీలు చెప్పటం. చాడీలు చెప్పటమనేది అందరికీ అనుభవంలో ఉన్న విషయమే. ఒకరికి గిట్టనివాడు ఎవరైనా ఉంటే వాడి పై అధికార్లకు వాడి గురించి లేనిపోనివి కల్పించి చాడీలు చెప్పటం అనుభవంలో చూస్తున్న విషయమే. పై అధికారులు అతడిని శిక్షిస్తే చాలా సంతోషకరంగా ఉంటుంది. అలా చాడీలు చెప్పటం కొందరి స్వభావం. వాడిమీద చాడీలు చెప్పావు. అందువలన వాడికైతే నష్టం కలిగింది. కాని నాకేమిటి లాభం అంటే అలా వాడు బాధపడటం చూసినప్పుడు నాకు ఆనందం కలుగుతుంది అంటాడు.

అందుకే ఈలోకంలో జనం నాలుగు రకాలుగా ఉన్నారన్నారు. కొంతమంది తమకే మాత్రం లాభం లేకపోయినా యింకొకరికి ఉపకారం చేయాలనెడి వ్రతాన్ని పాటిస్తుంటారు. వాళ్లు చాలా గొప్పవాళ్లు, వాళ్లని సత్పురుషులనాలి.

**ఏతే సత్పురుషాః పరార్థఘటకాః స్వార్థాన్ పరిత్యజ్య యే ।**

తమకంటూ స్వార్థం లేకుండ ఇంకొకరికి ఉపకారం చేయాలనెడి వ్రతం పెట్టుకుంటారు. మరికొంతమంది తమ స్వార్థానికి నష్టం కలుగనంతవరకు ఇతరులకు సహాయం చేస్తుంటారు.

**సామాన్యాస్తు పరార్థముద్యమభృతః స్వార్థావిరోధేన యే ।**

వాళ్లు మంచివాళ్లే. చెప్పుకోదగ్గ వాళ్లే. "మాకు కొంత సహాయం చేసి పెట్టండి" అంటే "అయ్యా! నీకు ఆ సహాయం చేస్తే నా కొంప మునుగుతుంది. అందువలన నాదగ్గరకు రాకు నాయనా" అంటారు. వాళ్లకు యిబ్బంది లేనంతవరకు సహాయం చేస్తుంటారు. వాళ్లుకూడ మంచివాళ్లే. ఇక తమ ప్రయోజనం కోసం ఇతరులకు అపకారం చేసేవాళ్లుంటారు. ఇంకొకడికి అపకారం చేయటంవలన వాడి ప్రయోజనం నెరవేరుతుంది. అందువలన ఇతరులకు అపకారం చేస్తారు. వాళ్లని మానుష రాక్షసులని అంటారు.

**తేऽమీ మానుషరాక్షసాః పరహితం స్వార్థాయ నిఘ్నన్తి యే ।**

వీళ్లే కాక నాలుగో రకం వాళ్లు కూడా ఉన్నారు. అయితే వాళ్లకి ఏ పేరు పెట్టాలో తెలిదు. ఎవరీ నాలుగోరకం. తమకు ఎటువంటి లాభం లేకపోయినా ఇతరులకు హాని చేస్తుంటారు వాళ్లు.

**యే తు ఘ్నన్తి నిరర్థకం పరహితం తే కే న జానీమహే॥**

తమకు ఏవిధమైన లాభం లేదు. అయినా ఇతరులకు హాని చేస్తూ సంతోషిస్తారు. ఈ ప్రవృత్తి మనసులలోనే కనిపిస్తుంది. అది మనకు తగదు. దానివలన మనం పాపాన్ని సంపాదించుకుంటాం. కాని వేరే ప్రయోజనం ఏమీ ఉండదు. పైశున్యం అని సంస్కృతంలో చెప్తారు. అంటే చాడీలు చెప్పటం. అటువంటి పాపం కూడా చేయవద్దు.

ఇక నాలుగోరకం వాచిక పాపాన్ని 'అసంబద్ధ ప్రలాపం' అంటారు. అసంబద్ధ ప్రలాపానికి వివరణ యిచ్చారు. మనం భగవంతుడి దగ్గర కూర్చున్నామనుకోండి. స్వామికి పూజ జరుగుతోంది. మనం మాత్రం భగవంతుడి సన్నిధిలో కూర్చొని ఊళ్లోని రాజకీయాలన్నీ మాట్లాడుతుంటాం. అది అసంబద్ధప్రలాపం. మనం కూర్చున్న సన్నివేశం ఏమిటి? మాట్లాడుతున్నదేమిటి? రెంటికీ ఏమాత్రం సంబంధం లేదు. ఊరి రాజకీయాలకు భగవంతుడికి సంబంధమేమిటి? నిజానికి ఆ సమయంలో భగవంతుని చింతన, భగవంతుని నామోచ్చారణ వినా మరేమీ పనికిరాదు. అటువంటి భావన లేకపోతే అక్కడ కూర్చొని ప్రయోజనమేమిటి? భగవంతుని సన్నిధిలో అర్థం లేని విషయాలన్నీ మాట్లాడుతూ కూర్చుంటే దానివలన ప్రయోజనం ఏమీ లేదు. అలా మాట్లాడటం కూడ ఒక పాపమే. దానిని అసంబద్ధ ప్రలాపమంటారు. ఒక ఉదాహరణను మాత్రమే యిప్పుడు చెప్పాం. సంబంధం లేకుండ అసంబద్ధ ప్రలాపం. అలా వాచికమైన పాపాలు నాలుగు రకాలు.

శారీరకమైన పాపాలంటే శరీర సంబంధమైనవి. వాటినే కాయిక పాపాలని కూడా అంటారు. ఇంకొకరి సొత్తును అహరించాలనెడి ఆలోచన మానసిక పాపం. అదే క్రియా రూపం దాలిస్తే శారీరకమైన పాపం.

**అదత్తానాముపాదానం**

ఇవ్వని దానిని తీసుకోవటం శారీరకమైన పాపం. ఎవరైనా మనకు యిచ్చిన దానిని తీసుకోవటం పాపం కాదు. దత్తానాం. యిచ్చినది అది ఎంతైనా తీసుకోవచ్చు. అదత్తానాం యివ్వని పదార్థాన్ని నీవు అపహరిస్తున్నావు. అది ఒక పాపం. శారీరకమైన పాపం. ఈ సందర్భంలో మా గురువుగారు ఒక కథను చెప్పేవారు. అది యిప్పుడు జ్ఞాపకానికి వస్తోంది.

నలుగురు మనుషులు కూర్చుని మాట్లాడుకుంటున్నారట. అందులో ఒకాయన తన చేతి గడియారాన్ని చూపిస్తూ అది విదేశీ గడియారమనీ చాలా విలువైనదనీ వివరించసాగాడట. అలా ఆయన ఆ గడియారం విలువను వర్ణిస్తున్నప్పుడే ఆ గడియారం కనపడకుండ పోయిందట. అక్కడ నలుగురే కూర్చున్నారు. గడియారం ఏమైందంటే ఎవరికి వారు మాకు తెలియదంటే మాకు తెలియదనసాగారు. అప్పుడు ఆ గడియారం యజమాని యిలా అన్నాడు: "అయ్యా! మీ పరువు తీయటం నాకిష్టం లేదు. ఈ గడియారం పెట్టెను ఇక్కడ పెడ్తాను. తరువాత లైట్ తీసివేస్తాను. గడియారాన్ని తీసుకున్నవాళ్లు దాన్ని పెట్టెలో పెట్టండి." ఆ తరువాత కేసును అక్కడపెట్టి లైట్‌ను తీసివేశాడు. అయిదు నిమిషాల తరువాత తిరిగి లైట్ వేసి చూసే కేసు కూడా మాయమయింది.

**అదత్తానాముపాదానం. ఇవ్వనటువంటి వస్తువును పరిగ్రహించటం పాపం.**

**హింసా చైవావిధానతః**

కారణం లేకుండా యింకొకరిని హింసించటం పాపం. కారణం లేకుండ అంటే... ఇంకో దేశంపై యుద్ధానికి వెళ్లిన సైనికుడు విదేశీ సైనికుడ్ని హింసించటం దోషం కాదు. అది అతనికి విహితమైన పని. కాని నీకు ఏవిధమైన సంబంధం లేకుండా యితరులను చిన్న దెబ్బ కొట్టినా నీవు పాపం చేసినట్లే! విదేశీ సైనికుడ్ని సైనికుడు సంహరించినా పాపంలేదుగాని నీవు యితరులపై చిన్న దెబ్బ వేసినా నీకు పాపం వస్తుంది. అందుకనే హింసా చైవా విధానతః అన్నారు. అపరాధికి న్యాయాధిపతి పెద్ద శిక్షను వేస్తాడు. వాడు చేసిన నేరం చాలా ఘోరమైనది. అందువలన న్యాయాధిపతి కఠినమైన శిక్షను విధించాడు. కాని న్యాయాధిపతి పాపం చేసినట్లు కాదు. అది ఆయన కర్తవ్యం. కాని ఎటువంటి సంబంధం లేకుండా ఇంకొకరిని హింసిస్తే అది పాపమవుతుంది. హింసా చైవా విధానతః కాబట్టి ఏవిధమైన కారణం లేకుండా ఇంకొకరిని హింసించటం పాపం.

**పరదారోపసేవా చ వివిధం కాయికం స్మృతమ్ ।**

మన సంస్కృతిలో స్త్రీలకు చాలా పెద్ద స్థానమున్నది. స్త్రీలను తల్లిగా భావించాలని మన సంస్కృతి మనకు బోధిస్తున్నది.

**మాతృవత్ పరదారేషు పరద్రవ్యేషు లోష్టవత్ ।**
**ఆత్మవత్ సర్వభూతేషు యః పశ్యతి న పశ్యతి ॥**

ఏ స్త్రీని చూసినా తల్లి అనెడి భావన కలగాలి. కాని తద్విరుద్ధమైన భావన ఏదీ మనస్సులో కలుగకూడదు.

సప్తశతిలో అమ్మవారిని దేవతలు స్తవం చేసేటప్పుడు :


**విద్యా స్సమస్తాస్తవదేవి భేదాః స్త్రియ స్సమస్తా స్సకలా జగత్సు ।**

(అమ్మా! తల్లీ సమస్త విద్యలు నీయొక్క స్వరూపములు. ఈ జగత్తులో కనపడే స్త్రీలందరు నీ స్వరూపములు) అన్నారు. అంటే ఒక స్త్రీని తల్లిగా భావించటం మన సంస్కృతి. మన ధర్మం. దానికి విరుద్ధంగా ఎవరు ప్రవర్తిస్తాడో వాడు పాపి. మహాపాపి. దానివలననే కదా రావణుడు అంతటి మహాశిక్షను అనుభవించాల్సి వచ్చింది. మేము దక్షిణ దేశంలో సంచారం చేసేటప్పుడు ఒకాయన మమ్మల్ని యిలా అడిగాడు : స్వామీ! శ్రీరాముడు రావణునికి పెద్ద శిక్షనే వేసినట్లు అనిపిస్తోంది. వాడు చేసిన అంత పెద్ద తప్పేమిటి? సీతమ్మ వారిని ఎత్తుకుపోయాడు. అపహరించాడు అంతేకదా!" సీతమ్మ వారిని అపహరించటం అంత పెద్ద తప్పా? అంతకంటె పెద్ద అపరాధం మరేదైనా ఉంటుందా? అది అపరాధములలో అతి ఉత్కృష్టమైనది. కాబట్టి వాడికి ఆ శిక్ష వినా మరో శిక్ష ఇవ్వటానికి వీలులేదు. అందువలన స్త్రీల విషయంలో మనం అత్యంత గౌరవంతో వ్యవహరించాలి. ఏవిధమైన తప్పుడు భావన ఎట్టి పరిస్థితులలోను మన మనస్సులలో రానీయ కూడదు. ఇది మన సంస్కృతి మన ధర్మం మనకు బోధిస్తున్న విషయం. ●

# ప్రపంచ దేశాల్లో భారత ప్రగతిని చాటిన నరేంద్రమోదీ!



## నరేంద్రమోదీ... 'స్టార్టప్' సైన్యం!



స్వాతంత్ర్యం సిద్ధించిన మరుసటి రోజు నుంచే భారతీయతను చిగుళ్ళు తొడగకుండా – అంటులోనే అంతం చేసారు. నెహ్రూ నాస్తికుడు. కావున, దేశం హిందూ దేశంగా వర్థిల్లలేకపోయింది. తరువాత వారందరూ ఆస్తికత్వాన్ని గానీ, భారతీయతను గానీ చిగురింపచేయలేకపోయారు.

69 సంవత్సరాలు అభారతీయంగా భారతీయత్వం అణగార్చబడుతూనే ఉంది. అయిదేండ్ల పదవీ కాలంలో నరేంద్రమోదీ మార్చగలడా–అన్న సందేహం కలుగుతూంది.

మోడీ బ్రహ్మచారి. వివేకానందునివలె దేశభక్తిగలవాడు. యువతలో మార్పు తేవాలని అహరహమూ ప్రయత్నిస్తున్నాడు. ఇప్పటి యువతలో అంతటి మార్పు వస్తుందా? అన్నదే....?

ఒక దేశ ప్రధాని ఎంట్రప్రెన్యూర్‌షిప్‌ను నినాదంగా చేసుకోవడం ఇదే ప్రథమం. 'స్టార్టప్స్' అన్న మాటను సాధికారికంగా పలకడం కూడా ఇదే తొలిసారి. గత ప్రభుత్వాలు పరిశ్రమల పేరుతో వేల ఎకరాల్ని దోచిపెట్టాయి. సంపన్నులు మరింత సంపన్నులైపోయారు. దేశానికి మాత్రం ఒరిగిందేం లేదు! నిన్నటి పాలకులు అస్మదీయ సంస్థలకు అర్థం లేని రాయితీలిచ్చారు. ప్రజలకు మాత్రం ఎలాంటి మేలూ జరగలేదు! నిన్నటి లోపాల్ని సవరిస్తూ, మొన్నటి పాపాల్ని కడిగేస్తూ, ప్రధాని మోడీ చరిత్ర గతిని మార్చే సమకాలీన నినాదమిచ్చారు. 'స్టార్టప్ ఇండియా' ద్వారా యువ ఎంట్రపెన్యూర్స్‌ను మార్పు సైనికులుగా ఎంచుకున్నారు. మోదీ ఆలోచనల్లోనూ అంతే తీవ్రత. అదే చిత్తశుద్ధి. ఆ భావస్వరూపమే ఇద్దర్నీ సమష్టి లక్ష్యం దిశగా నడిపిస్తోంది.


'రైతు కష్టాల్లో ఉన్నాడు. మనం టెక్నాలజీ ఆసరాతో అండగా నిలబడాలి. ప్రతి నీటి బొట్టునూ ఎంత పొదుపుగా వాడుకోవచ్చో చెప్పాలి. జానెడు నేలనైనా ఎంత సమర్థంగా ఉపయోగించుకోవచ్చో వివరించాలి. నాగలికి సాంకేతిక శక్తి తోడైతేనే, వ్యవసాయం లాభసాటి అవుతుంది.' – **మోదీ**

రెండున్నర శాతం భూభాగంలో, నాలుగు శాతం జనవనరులతో... ప్రపంచ జనాభాలో పదిహేడు శాతం మందిని భారత్ పోషించాల్సి వస్తోంది. ఆ బరువంతా రైతన్న భుజం మీదే పడుతోంది. అంతటి రైతన్న త్యాగానికి మనమిస్తున్న ప్రతిఫలం – అప్పులూ, ఆకలిచావులూ అంతంతమాత్రం ప్రాథమిక సౌకర్యాలూ! ఆ పరిస్థితుల్ని రూపుమాపడానికి చాలా 'స్టార్టప్స్' తమదైన మార్గంలో నడుం బిగించాయి. వ్యవసాయ రంగం తీవ్రమైన విద్యుత్ కొరతను ఎదుర్కొంటోంది. కరెంటు కోతలు సేద్యగాడి గుండెలకు కోతలు పెడుతున్నాయి. అర్ధరాత్రీ అపరాత్రీ అన్న తేడా లేకుండా, ఏ మూలనో ఉన్న పొలానికి పరుగులు పెట్టాల్సిన పరిస్థితి. చీకట్లో విష సర్పాల బారిన పడేవారూ, రోడ్డు ప్రమాదాలకు బలైపోతున్నవారూ ఎంతోమంది... యువతలో మార్పు వస్తుందా అన్నది ప్రశ్న... ఎందుకిన్ని బాధలు? రిమోట్ కంట్రోల్‌తో మోటారును నడిపించలేమా?' అన్న తపన మద్రాసు ఐఐటీ పూర్వ విద్యార్థి దిన్నెపు విజయభాస్కర్‌తో విన్నినెట్ టెక్నాలజీని స్థాపించేలా చేసింది. 'కిసాన్ రాజా'గా పిలిచే సెట్ టాప్ బాక్స్‌తో... సెల్‌ఫోన్‌ను రిమోట్‌లా వాడుకోవచ్చు. ఇంట్లో కూర్చునే పొలంలోని మోటరుతో పనిచేయించవచ్చు. భూగర్భజలాల్లో తేడా వచ్చినా రైతుకు హెచ్చరికలు అందుతాయి. పల్లెల్లో మోటారు దొంగల బెడద తగ్గుతుంది, అలాంటి ప్రమాదమేమైనా జరిగితే... క్షణాల్లో సెల్‌ఫోన్‌కు సందేశం వచ్చేస్తుంది. ఊళ్లో సేద్యం చేసుకుంటున్న అన్నయ్యను నగరానికి తీసుకెళ్లి బాగా చూసుకోవాలన్నది విజయభాస్కర్ ఆలోచన. కానీ, ఆయన ఒప్పుకోలేదు. 'వీలైతే, పల్లెలో నా సేద్యం సాఫీగా సాగిపోడానికి నీ వంతుగా ఏమైనా చేయగలవా?' అన్న సోదరుడి ప్రశ్న విజయ్ ఆలోచనల్నే మార్చేసింది. అతన్ని అగ్రిప్రెన్యూర్‌ను చేసింది.

గ్రామాల్లో గిడ్డంగుల్లేవు. ఉన్నా, భారీ అద్దెలు చెల్లించే స్థోమత రైతుకు లేదు. దీంతో కష్టపడి పండించిన పంటను ఒక్కపూటైనా నిల్వ ఉంచలేకపోతున్నాడు. హఠాత్తుగా ఏ వర్షాలో మొదలైతే శ్రమంతా నీటిపాలైనట్టే. దీంతో గింజలు చేతికి రాగానే ఏదో ఒక ధరకు అమ్మేసి చేతులు దులుపుకుంటుణ్నాడు. ఓ గదినో, ఖాళీ జాగానో తక్షణ అవసరాలకు గిడ్డంగిగా మార్చుకునే వుసులుబాట్లు ఉంటే రైతుకు ఇబ్బందే ఉండదు. ఆ ఆలోచనతోనే 'సోహన్‌లాల్ కమాడిటీ మేనేజ్‌మెంట్'ను స్థాపించాడు సందీప్ సబర్వాల్. ఇరవై నాలుగు గంటల వ్యవధిలో తాత్కాలికమైన గిడ్డంగిని నిర్మించి ఇస్తుందా సంస్థ. గిట్టుబాటు ధర వచ్చేదాకా దర్జాగా నిల్వ చేసుకోవచ్చు. క్రిమి కాటకాల బెడద ఉండదు. ఎండవానల బాధా ఉండదు.

గ్రామీణ రవాణా వ్యవస్థలో కాలం చెల్లిన వాహనాలదే పెత్తనం. ఫలితంగా, తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటాయి. రైతన్నది అసలే అంతంత మాత్రం ఆర్థిక పరిస్థితి. మళ్లీ ఇలాంటి ప్రమాదాలొకటి! ఆ దుస్థితి ఆటోమొబైల్ ఇంజినీరింగ్ విద్యార్థి అభినవ్‌కుమార్‌కు ఆందోళన కలిగించింది. గ్రామీణ భారతానికి తక్కువ ధరలో సురక్షితమైన రవాణా వాహనాల్ని అందించే ఉద్దేశంతో ఇవేమో పేరిట ఉత్తరప్రదేశ్‌లో ఓ సంస్థను స్థాపించాడు. 'గ్లోబల్ డిజైన్ – లోకల్ మెటీరియల్' అతని నినాదం. ఆ వాహనాలు పర్యావరణానికి ఏమాత్రం హాని చేయవు! మార్కెట్లో దళారుల వ్యవస్థను రూపుమాపడం, రైతుకు మొబైల్ ద్వారా వ్యవసాయ సలహాలు అందించడం, భూసార పరీక్షలు జరిపించడం... ఇలా సేద్యంతో ముడిపడిన వ్యాపార ఆలోచనలతో ఎన్నో స్టార్టప్స్ ముందుకొస్తున్నాయి. ఇవన్నీ ఫలిస్తే దేశం సుజలాం – సుఫలాం అవుతుంది. ●

# తిరుమల తిరుపతి దేవస్థానానికి ౮౩ సంవత్సరాలు



**1933** సంవత్సరంలో తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి యేర్పడింది. (అదే 1933 సం॥ములో మార్చి 7న నేను జన్మించడం ఆనందకరంగా ఉన్నది)

తిరుమల వేంకటేశ్వరస్వామిని పల్లవులు, చోళులు, పాండ్యులు, తెలుగు చోళులు, తెలుగు పల్లవులు, విజయనగర రాజులు, ఆర్కాటు నవాబులు, బ్రిటిషుదొరలు, మహంతులు యెందరో సేవలు (పాలన) చేసిన తరువాత 1933 సం॥ములో తిరుమల తిరుపతి దేవస్థాన పాలకమండలి యేర్పడింది.

తిరుమల తిరుపతి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా, పాలకమండలి చేర్మన్‌గా చెలికాని అన్నారావు సేవలందించారు. భక్తజనం అందరూ గుంపులు గుంపులుగా సందడి చేస్తూ, ఏడుకొండలూ మెట్లెక్కి వెళ్లేవారు.

1944 సం॥ము ఏప్రిల్ 10న కొండకు వాహనదారి ఏర్పడింది. అంతవరకూ కాలినడకనో, డోలీలు మీదనో ఏడుకొండలూ అధిరోహించివెళ్లేవారు.

1933 సం॥ము వరకు స్వామివారికి విశ్రాంతి సమయం ఎక్కువగా ఉండేది. క్రమక్రమంగా శ్రీవారి విశ్రాంతి సమయం తగ్గుతూ వచ్చింది. ప్రస్తుతం అయితే స్వామివారి విశ్రాంతి 4 గంటలు కూడా ఉండడం లేదంటే– ఆశ్చర్యం కలుగవచ్చు. 1954 సం॥ములో ఒక జతబట్టలు, స్నాన తువ్వాళ్ళు, పంచె కండువా తీసుకుని బయల్దేరాను. రేణిగుంట స్టేషను వరకూ రైలు, అక్కణ్ణుంచీ బయల్దేరే తిరుమల తిరుపతి దేవస్థానం వారి బస్సులో తిరుమలకు వెళ్ళి– (ఇప్పటి కల్యాణకట్ట వద్ద స్నానాల గదులుండేవి) అక్కడ వేడినీళ్ళు స్నానం చేసి, తిన్నగా మహద్వారం గుండా (ఏ మలుపులు తిరుగకుండా) వెళ్లి– స్వామివారిని దర్శించి – ఆఫీసు కౌంటర్లలో లడ్డూలు క్రయం చేసి– అక్కడే ఓ ఫర్లాంగు దూరంలో ఉన్న దేవస్థానం వారి కాంటీనులో ఫలహారం, కాఫీ సేవించి – తిరుగు బస్సులో తిరుమల నుంచీ తిరుపతికి వచ్చి, మద్రాసు వెళ్ళు తమిళనాడు ట్రాన్స్‌పోర్టువారి బస్‌లో గృహం చేరేవారం.

1956–57 సంవత్సరంలో నా సతీమణి వచ్చినప్పట్నుంచీ – ఇదే తరహా ప్రయాణం, పిల్లలు కలిగిన తరువాత తిరుమల సత్రంలో గది తీసుకుని, ఎండీ ఎండని పచ్చికట్టె (అవేదొరికేవి) తీసుకుని, వంట చేసుకుని– శ్రీవారి దర్శనం మహద్వారం గుండా వెళ్లి ప్రశాంతంగా చేసుకునేవారం. అటు తరువాత సిఫార్సులతో (క్యూ లైను బాధలేకుండా) స్వామివారి దర్శనం చేసుకువచ్చేవారం.

శ్రీవారిని దర్శించడంలో ఆనాడు గల ప్రశాంతత– ధ్వజస్థంభానికి నమస్కరించుకుని, దర్శన భాగ్యం ఇప్పుడు లేనేలేదు. 1974 సంవ్సరంలో రెండవ ఘాట్ రోడ్డు వచ్చింది. బస్సులూ, కార్లూ అనేక వాహనములు పెరిగాయ్. ప్రశాంతతకు చెల్లుచీటి యిచ్చాయి. ●

# పృథ్విని పాలించిన తొలి చక్రవర్తి పృథ చక్రవర్తి!

**భా**రతదేశమెంతో పుణ్యం చేసుకున్న ధర్మభూమి, ధర్మం ప్రాతిపదికగా పాలించిన ధర్మచక్రవర్తులెందరో ఉన్నారు. సత్యధర్మాల్నే వారు ఆచరించారు. పాలించారు.

భరతుడు పాలించిన పుణ్యదేశమైనందున భారతదేశంగా సంబోధిస్తున్నాము. పుణ్యదేశమైన భారతదేశమును పృథ్విగా తలచినవారున్నారు. పృథ్వియని పిలవడానికి ప్రధాన కారణభూతుడు పృథ్వి మహారాజు.

పృథ్వి సర్వభూత శరణ్యుడూ, సత్యసంధుడూ, బ్రాహ్మణ్యుడు, పెద్దలను గౌరవించడంలోనూ, దీనులను కరుణించడంలోనూ, ధిక్కారపరులను కఠినంగా దండించడంలోనూ త్రిగుణాతీతుడు. బ్రహ్మజ్ఞానస్వరూపుడు, భగవత్స్వరూపుడనే ప్రాణకోటి సమస్తమూ గౌరవించింది.

ఆయనే ధర్మమూర్తియైన తొలిచక్రవర్తి. ఆయన పేరుననే భరతభూమి పృథ్విగా కొనియాడబడింది. ఆయన ఉదయ పర్వతము వరకు గల సమస్త భూమండలమునూ పాలించాడు. ధర్మస్థాపనం చేశాడు.

పృథ్వీపతియే నమః అంటూ ఆయన్ను స్మరిస్తే జన్మతరిస్తుంది.

# తెలుగుదేల యన్న దేశంబు తెలుగేను!

**తెలుగుదేల యన్న దేశంబు తెలుగేను**
**దెలుగు వల్లభుండ, దెలుగొకండ,**
**యెల్ల నృపులు గొలువ నెఱుగవే బాసాడి**
**దేశభాషలందు తెలుగు లెస్స!** అన్న ఒకే ఒక సార్వభౌముడు శ్రీకృష్ణదేవరాయలు.

శ్రీకృష్ణదేవరాయులుకు శ్రీకాకుళాంధ్ర మహావిష్ణువు కలలో కనబడి “అయ్యా! అందరూ సంస్కృతంలో కావ్యాలు రచిస్తున్నారు. నా కోసం తెలుగులో ఒక కావ్యాన్ని రచించు” అని ఆదేశించాడు.

భగవంతునికి అన్ని భాషలూ ఒక్కటే! ముఖ్యంగా దేవభాష సంస్కృతంలోనే ప్రార్థన స్తుతి ఉపాసన చేయాలని మన పెద్దవాళ్లు అభిప్రాయపడ్డారు. కాని భగవంతుడే స్వయంగా తెలుగులో కావ్యాన్ని రచించమనడం సాహిత్య చరిత్రలో తొలి విశేషమైన విశేషం. ఇంతటి ఘనత కలిగిన తెలుగు భాష నేడు క్షీణదశకు చేరుకుంటున్నదంటే బాధ్యతవహించవలసినవారు ప్రభుత్వాలు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ, మేధావులు, చలనచిత్రాలు, ప్రజలు.

నేటికాలంలో చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలకు తెలుగు రాదని ఎంతో గర్వంతో చెబుతారు, పొంగిపోతున్నారు. కారణం శాస్త్ర, విజ్ఞాన రంగాలలో తెలుగు భాష మాధ్యమంగా విస్తృత స్థాయిలో లేకపోవడమో దురదృష్టకరం.

తెలుగు ఉపాధ్యాయులు మొక్కుబడిగా పాఠాలను చెప్పి, ప్రశ్న జవాబులను గుర్తు చేసుకోమని పరీక్షలకు సిద్ధం చేయడం తప్ప బోధనా భావంతో విద్యార్థులు స్పందించేటట్లు పాఠాలను చెప్పడం లేదు. ఇటు తల్లిదండ్రులకు అటు విద్యార్థులకు ఉపాధ్యాయులకు ఆసక్తి కనిపించడం లేదు. ఇక ఇంటర్మీడియట్, సెకండరీ బోర్డు విద్యాశాఖలు తెలుగు వద్దు మొర్రో అని తల్లడిల్లిపోతున్న ఈనాటి కాలంలో మార్కుల కోసమని ఫ్రెంచ్, సంస్కృతం, హిందీ భాషలను ప్రవేశపెట్టారు. సంస్కృతం విషయానికొస్తే చాలామంది విద్యార్థులకు సంస్కృతం చదవడం రాదు. వ్రాయడం రాదు. అయినా పరీక్షలో నూటికి తొంభై తొమ్మిది మార్కులు మాత్రం వస్తున్నాయి. తెలుగు ఉపాధ్యాయులైనా తెలుగులో బాగా పరీక్ష వ్రాసే విద్యార్థుల విషయంలో కాస్త చూసి మార్కులను వేయడానికి ఇష్టపడరు.

పాఠ్యాంశాలను నిర్ణయించే మేధావులు, ఏనాడూ తరగతి గదిలోని విద్యార్థులను చూసి పాఠం చెప్పి ఎరుగరు. ఇప్పటి విద్యార్థులు చలనచిత్రాలను చూసి తెలుగు భాషను నేర్చుకుంటారనుకుంటే ఒకప్పటి పాతతరం చిత్రాలలో వలె ఇప్పటి చలనచిత్రాల్లో ఒక నిర్దిష్టమైన ప్రమాణభాష లేదు. ఈ విధంగా తెలుగుభాషకు భాషాపురోభివృద్ధికి వీళ్లే ఆటంకం కలిగిస్తున్నారు. కాబట్టి మన మాతృభాషను పరిరక్షించుకోవలసిన బాధ్యత మనపైననే ఉన్నది. తెలుగు ఉపాధ్యాయులు తమ




వంతు శ్రద్ధ, కృషిని సక్రమంగా నిర్వహించాలి. విద్యార్థులు తీరిక వేళలో తెలుగు కథలను, పాటలను, పద్యాలను వినడం, చదవడం, నేర్చుకోవడంపై ఆసక్తి కలిగి ఉండాలి. ఒక అలవాటుగా పెట్టుకోవాలి.

ముఖ్యంగా తెలుగుభాష అభివృద్ధి చెందాలంటే తెలుగును ఐచ్ఛిక అంశంగా తీసుకొని విద్యనభ్యసించే వాళ్లకు ప్రభుత్వం ఉపాధి మార్గాన్ని కల్పించాలి. ప్రభుత్వం చిత్తశుద్ధితో సచివాలయంలోను, న్యాయస్థాన, రాష్ట్రరోడ్డు రవాణా సంస్థలలో, మండలాధికారి కార్యాలయాలలో తెలుగు భాష కచ్చితంగా అమలు జరిగేటట్లు చూడాలి. మనం పోరాడి తెలుగు భాషకు ప్రాచీన హోదాను తెచ్చుకున్నట్లుగానే, ప్రభుత్వ సంస్థలోని అన్ని కార్యకలాపాలలో తెలుగును అమలు జరిగేటట్లు చూడాలి. మాతృభాష నేర్చిన ఉపాధ్యాయులుండాలి. మన ప్రయత్నాలను సఫలీకృతం చేయడానికి ఆ శ్రీకాకుళాంధ్ర మహావిష్ణువే తోడుగా ఉండాలి. ●

తెలుగువారందరికీ తెలుగు వస్తుందనుకోవడం పొరబాటు, తెలుగు చదువుకున్నవారిలో 80 శాతం మందికి శ్రీకృష్ణదేవరాయలు శ్రీకాకుళంలో చెప్పిన ఈ క్రింది పద్యం స్ఫురణకు వస్తుంది.

శ్రీకృష్ణదేవరాయలు శ్రీకాకుళ ఆంధ్ర మహావిష్ణువు ఆలయాన్ని దర్శించినపుడు, కలలో ఆంధ్ర మహావిష్ణువు దర్శనమిచ్చి, ఆనతి నొసంగిన తరువాతనే ‘ఆముక్త మాల్యద’ పద్యకావ్యాన్ని రచించారు. ఆయనకు తెలుగుభాషపై, తెలుగు కవులపై అపారమైన అభిమాన గౌరవాలున్నాయ్. అష్టభాషా కవి దిగ్గజాలను ఆయన ఆస్థానంలో నియమించారు. వారందరూ కావ్య రచన చేసేట్టు ప్రోత్సహించారు. అష్టకవి దిగ్గజాలవలెనే వారి కావ్యాలూ ప్రసిద్ధిగన్నాయ్, ‘మనుచరిత్ర రచించిన అల్లసాని పెద్దన గజారోహణ గౌరవం పొందాడు. తెనాలి రామకృష్ణకవి ఎన్నో మెప్పులు పొందాడు. ‘పాండురంగమహత్త్యం అనే గొప్ప కావ్యాన్ని రచించారు. ఇలా ఎందరో కావ్యరచనముల్జేయడానికి కృష్ణరాయలే కారణం; తెలుగు వాఙ్మయ కీర్తి దిశావళియంతా వ్యాపించింది.

దేశభాషలందు తెలుగులెస్సయనిపించిన యశస్వి శ్రీకృష్ణదేవరాయలు.

SRI RAJARAJESWARI JEWELLERY
The Oldest Jewellery Shop in Pondy Bazaar
81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.
Phones : 28152387, 28154653
*The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation*